

మాండలికపు పరిమళాలు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆకాశవాణి కేంద్రం 1986 అక్టోబర్ 12న ప్రారంభమైంది. 2015 ఆగస్టు 15న నాణ్యతతో కూడిన కార్యక్రమాలు ప్రసారం చేసింది. 8లో▸



అధిక ధరలకు మద్యం! 9లో▸

చింతలమానెపల్లి మండలంలో ధరలు పెంచి మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఇక్కడి నుంచి మద్యాన్ని మహారాష్ట్రలోని పలు ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
32.4/13.1

వాతావరణం

ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. రాత్రి చలి పెరుగుతుంది. వేకువజామున మంచు ఎక్కువగా కురుస్తుంది.

న్యూస్‌రీల్

కనుల పండువగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారికి పట్టువస్త్రాలు తెస్తున్న భక్తుడు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని అర్చకులు వౌరుల నరేశ్‌శర్మ, ఇందారపు మధూకరశర్మ, గట్టు సాయిశర్మ, అనంత్‌శర్మ, సూర్యనారాయణశర్మ, విజయ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం ఆలయంలో సుప్రభాత సేవ, నిత్య పూజాభిషేకం చేశారు. అనంతరం వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని జరిపించారు. దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్షుడు వైరాగరే మనోజ్ నివాసం నుంచి వైరాగరే ప్రతాప్ భాజాభజంత్రీల మధ్య పట్టు వస్త్రాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని స్వామివారికి సమర్పించారు. వార్షికోత్సవంలో మొదటిరోజు శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాలతో పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటరవీందర్, బాల్‌కిషన్, సుబ్బ శ్రీనివాస్, పరండే గోపాల్, అధికసంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికుల నిరసన ఆదివారం ఐదోరోజూ కొనసాగింది. వేతన బకాయిలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ జమ చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే దాకా నిరసన కొనసాగిస్తామని తెలిపారు.

సేవాలాల్ వారోత్సవాలు



నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామంలో ధర్మ జాగరణ ఆధ్వర్యంలో ఆదివారం సేవాలాల్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంస్థ ప్రాంతీయ ఇన్‌చార్జి దయానంద్ మాట్లాడారు. బంజారాలు అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరూ సేవాలాల్ మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో సభ్యులు గోపాల్, లచ్చయ్య, శివ, బలిరాం తదితరులున్నారు.

బస్‌డిపోకు నూతన భవనం నిర్మించాలి

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో బస్సు డిపో కోసం నూతన భవనం నిర్మించాలని ఆదివారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు అసెంబ్లీలో సంబంధిత మంత్రిని బడ్జెట్ సెషన్‌లో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొట్టమొదటి డిపో ఆసిఫాబాద్ అని పేర్కొన్నారు. భవనం పురాతనంగా మారిందని, దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సక్కు

సిర్పూర్(టి) రైల్వేస్టేషన్



మూడోలైన్ పూర్తయ్యేదెప్పుడో!

- పనుల కారణంగా తరచూ రైళ్ల రద్దు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి

సిర్పూర్(టి): కాజీపేట్–బల్లార్షా ప్రధాన రైల్వే మార్గంలో తరచూ రైళ్ల రద్దు ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ మార్గంలో మూడోలైన్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈనెల 8నుంచి 14వ తేదీ వరకు పలు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించి అమలు చేస్తున్నారు. దీంతో ఈ మార్గంలో ప్యాసింజర్ రైళ్లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్–న్యూఢిల్లీ ప్రధాన రైల్వే రహదారి ఇదే కావడంతో మూడోలైన్ పనులు వేగంగా పూర్తి చేయాలని రైల్వే అధికారులు సూచించినా గతేడాది భారీ వర్షాల కారణంగా పనులు స్తంభించాయి. గడువులోగా కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుండా ఇంకా కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా పనులు నత్తనడకన కొనసాగుతుండగా ఈనెల 24వ తేదీ వరకు రైళ్ల రద్దును పొడిగిస్తారని రైల్వే అధికారులు చెబుతున్నారు. సిర్పూర్(టి)–బల్లార్షా మధ్యలోని వీరూర్, మాకిడి రైల్వేస్టేషన్ల సెక్షన్లలో ట్రాఫిక్ బ్లాక్ కారణంతో ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయగా ఈ మార్గంలోని రైల్వేస్టేషన్లు ప్రయాణికులు లేక వెలవెలబోతున్నాయి.

రద్దయిన ప్యాసింజర్ రైళ్ల వివరాలు

సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా ప్రతిరోజూ వెళ్లే ప్యాసింజర్ ట్రెన్ నంబర్ 17035 కాజీపేట్–బల్లార్షా, ట్రెన్ నెంబర్ 17036 బల్లార్షా–కాజీపేట్, ట్రెన్ నంబర్ 17003 కాజీపేట్–సిర్పూర్(టి), ట్రెన్ నెంబర్ 17034 సిర్పూర్(టి)– భద్రాచలం, ట్రెన్ నంబర్ 07765 కరీంనగర్–సిర్పూర్(టి), ట్రెన్ నెంబర్ 07766 సిర్పూర్(టి)–కరీంనగర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఉత్తర్వులు జారీ చేసి అమలు చేస్తున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే రైళ్ల ద్వారా సిర్పూర్(టి), కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ మండలాల ప్రజలతో పాటు సమీపంలోని మహారాష్ట్ర గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ప్రయాణాలు సాగిస్తుంటారు. రైళ్ల రద్దుతో మారుమూల గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి ఎలాంటి రైలు సౌకర్యం లేకపోవడంతో కాగజ్‌నగర్ పట్టణానికి వెళ్లి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు స్పందించి రద్దు చేసిన రైళ్లను త్వరగా పునఃప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రైళ్ల రద్దుతో ఇబ్బందులు



సిర్పూర్(టి) రైల్వేస్టేషన్ నుంచి ప్రతిరోజూ కొనసాగే రైళ్లను రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత్యంతరం లేక కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వచ్చి రైలు ప్రయాణం సాగించాల్సి వస్తోంది. రైల్వే అధికారులు స్పందించి రద్దు చేసిన రైళ్లను త్వరగా పునఃప్రారంభించాలి.

– ఎన్న సాయి, ప్రయాణికుడు

త్వరగా పనులు పూర్తి చేయాలి



మూడేళ్లుగా మూడోలైన్ పనులు కొనసాగుతున్నాయి. సకాలంలో పూర్తి చేయకపోవడంతో తరచూ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నారు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. రైల్వే అధికారులు స్పందించి పనులు వేగంగా పూర్తి చేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలి.

– చింటు, ప్రయాణికుడు

ఏజెన్సీ ఆస్పత్రులకు 'ఎన్‌క్వాస్'

ఉట్నూర్: ఏటా జాతీయ వైద్యారోగ్యశాఖ ఇచ్చే ఎన్‌క్వాస్ గుర్తింపునకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంత పరిధిలోని ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) ఇప్పటికే ఎంపికయ్యాయి. తాజాగా ఈనెల 3, 4 తేదీల్లో జాతీయ వైద్య ఆరోగ్య శాఖ బృందం అంకోలి పీహెచ్‌సీని కూడా పరిశీలించింది. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలపై సంబంధిత బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో త్వరలో ఈ పీహెచ్‌సీకి కూడా 'ఎన్‌క్వాస్' దక్కే అవకాశం ఉంది. ఈ గుర్తింపు పొందిన పీహెచ్‌సీలకు జాతీయ వైద్య ఆరోగ్యశాఖ మూడేళ్ల పాటు ఏటా రూ.3 లక్షల చొప్పున ప్రత్యేక నిధులు విడుదల చేస్తుంది. ఈ నిధులతో ఆయా ఆరోగ్య కేంద్రాలు మరింత అభివృద్ధి సాధిస్తాయి.

ఎన్‌క్వాస్ అంటే...

ఎన్‌క్వాస్ అంటే.. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్(జాతీయస్థాయి ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు). ఇది కేంద్ర ఆరోగ్యశాఖ పరిధిలో పని చేస్తుంది. ఎన్‌క్వాస్ నుంచి నలుగురు సభ్యులతో కూడిన బృందం పీహెచ్‌సీలను పరిశీలిస్తుంది. ఇందులో ప్రజలకు అందుతున్న వైద్యసేవలు, వైద్యులు, సిబ్బంది పనితీరుతోపాటు 110 రకాల సేవలు, సౌకర్యాలు, వసతులను పరిశీలించి మార్కులను అందజేస్తుంది. ఈ బృందం ఇచ్చే నివేదికల ఆధారంగా ఆయా పీహెచ్‌సీలకు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ ఎన్‌క్వాస్ గుర్తింపు ఇస్తుంది.

ఇప్పటికే ఎనిమిది.. త్వరలో అంకోలి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 31 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి ద్వారా గిరిజనులకు నిత్యం వైద్య సేవలు అందిస్తోంది. వైద్యాధికారులు, సిబ్బంది ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించడం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారు. వీటి పనితీరు, సౌకర్యాలు, ప్రజలకు అందిస్తున్న వైద్యం, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలను పరిశీలించిన ఎన్‌క్వాస్ బృందం ఇప్పటికే ఎనిమిది పీహెచ్‌సీలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేయడంతో వాటికి గుర్తింపు లభించింది. ఇందులో బజార్‌హత్నూర్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, దంతన్‌పల్లి, భీంపూర్–టీ, గాదిగూడ, సిర్పూర్(యూ), రోంపల్లి పీహెచ్‌సీలు ఉన్నాయి. తాజాగా అంకోలి పీహెచ్‌సీని కూడా ఎన్‌క్వాస్ బృందం పరిశీలించింది. త్వరలోనే దీనికి కూడా గుర్తింపు దక్కే అవకాశం ఉంది.

మూడేళ్లు.. రూ.9 లక్షలు

ఎన్‌క్వాస్ అర్హత సాధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మూడేళ్ల పాటు ఏడాదికి రూ.3 లక్షల చొప్పున రూ.9 లక్షలు మంజూరు చేస్తుంది. ఈ నిధుల్లో 25 శాతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి బోనస్ లభిస్తుంది. మిగతా నిధులు పీహెచ్‌సీకి కావాల్సిన మౌలిక వసతుల కల్పన, మందుల కొనుగోలు తదితర అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

అందవెల్లి వంతెన పిల్లర్ల తొలగింపు

- రూ.13 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు

దహెగాం: దహెగాం–కాగజ్‌నగర్ మండలాల మధ్య అందవెల్లి పెద్దవాగుపై నిర్మించిన వంతెన ఎనిమిదో పిల్లర్ 2021లో వచ్చిన భారీ వరదలకు కుంగిన విషయం తెలిసిందే. 2022 జూలైలో మరోసారి భారీ వరదలు రాగా కుంగిన పిల్లర్ మరింత కుంగి ప్రమాదస్థాయికి చేరింది. దీంతో సంబంధిత అధికారులు రాకపోకలు నిలిపివేశారు. కుంగిన వంతెనకు మరమ్మతు కోసం 2022 నవంబర్‌లో ప్రభుత్వం రూ.2.90 కోట్లు మంజూరు చేసింది. పనుల ప్రారంభానికి ముందే 9, 10వ పిల్లర్లు కూడా కూలిపోయాయి. ప్రస్తుతం రూ.2.90 కోట్లతో పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ వేగవంతంగా కొనసాగిస్తున్నారు. కుంగిన 8, 7వ పిల్లర్లను తొలగించే పని చేపడుతున్నారు. రెండు రోజుల క్రితం వాటిని కూల్చేశారు. వంతెన కూలడంతో అధికారుల అంచనాలు తారుమారు కాగా, మరోసారి రూ.13 కోట్లతో అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి నివేదించినట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. నిధులు మంజూరైతే వంతెన పూర్తయ్యే అవకాశాలున్నాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం పూర్తి చేస్తే ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయి. వానాకాలం వరకు పనులు పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.



కూల్చేసిన వంతెన 7, 8వ పిల్లర్లు

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థులు

రెబ్బెన(ఆసిఫాబాద్): మందమర్రి పట్టణంలోని కృష్ణ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో రెబ్బెన మండలానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ చాపిడి కుమార్ తెలిపారు. డ్రాగన్ కుంగ్‌ఫూ క్లబ్ తరఫున పోటీల్లో పాల్గొన్న టీ జస్వంత్, జే సాయి మోక్షజ్ఞ కటాస్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబర్చి పతకాలతో పాటు అందరి మన్ననలు పొందినట్లు పేర్కొన్నారు.

రెబ్బెనలో ఎడారి ఓడలు

ఎడారి ప్రాంతంలో కనిపించే ఒంటెలు ఆదివారం ఉదయం రెబ్బెన మండల కేంద్రంలో కనిపించాయి. రాజస్థాన్‌కు చెందిన గొర్రెలు, మేకల పెంపకందారులు ఆదివారం రెబ్బెన మండల కేంద్రం మీదుగా ఆసిఫాబాద్ వైపు ఒంటెలతో వెళ్తుండగా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. – రెబ్బెన(ఆసిఫాబాద్)



జోడేఘాట్ సమస్యలు పరిష్కరిస్తాం



గుస్సాడీలతో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు

- కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు

కెరమెరి(ఆసిఫాబాద్): జోడేఘాట్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు హామీ ఇచ్చారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాక మొదటిసారి ఆయన ఆదివారం మండలంలోని జోడేఘాట్‌ను సందర్శించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీం సమాధిపై పూలు చల్లి పూజలు చేశారు. మ్యూజియాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. డబుల్‌బెడ్రూంలు పూర్తయ్యేలా చూస్తామని, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అంతకుముందు ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ దుర్పతాబాయి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

బెట్టి ఎలిజిబెత్ దంపతులకు పూజలు

జైనూర్ మండలం మార్లావాయి గ్రామాన్ని కలెక్టర్ బోర్కడే హేమంత్ సందర్శించారు. బెట్టి ఎలిజిబెత్ దంపతులకు నివాళులర్పించారు. హైమన్‌డార్ఫ్ చరిత్ర తెలుసుకున్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజుకు మంజూరైన డబుల్‌బెడ్రూం, గ్రామంలో ఏర్పాటు చేసిన గుస్సాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతాబాయి, తహసీల్దార్ సాయన్న, మార్లావాయి సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వర్, నాయకుడు రాజేశ్వర్ తదితరులున్నారు.



భీంకు నివాళులర్పిస్తున్న కలెక్టర్

మహాదగా..!

- మన పల్లెల్లోకి పక్క రాష్ట్ర దళారులు
- అధిక ధర చెల్లిస్తామంటూ బుకాయింపు
- అదనపు తూకం వేస్తూ నిలువుదోపిడీ
- ఇటీవల గోయగాంలో ఇలాంటి ఘటనే..
- చిరు జరిమానాతో వదిలేసిన అధికారులు

కెరమెరి(ఆసిఫాబాద్): ఈ ఏడాది పత్తి సాగు చేసిన రైతుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తికి గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. కొందరు మార్కెట్ ధరకే అమ్ముకుని ఆర్థికావసరాలు తీర్చుకున్నారు. మరికొందరు ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. కళ్లల్లో వత్తులు వేసుకుని ధర పెరుగుతుందని నిరీక్షించారు. ఈక్రమంలో పొరుగునే ఉన్న మహారాష్ట్రకు చెందిన దళారులు రంగప్రవేశం చేసి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అధిక ధరకు కొనుగోలు చేస్తామని నమ్మబలికి తూకంలో మోసాలకు పాల్పడుతూ నిలువునా ముంచుతున్నారు. కొంతకాలంగా మహారాష్ట్రకు చెందిన కొందరు దళారులు కెరమెరి మండలంలోని లేండాగూడ, అంతాపూర్, సాంగ్వి, సుర్దాపూర్, గోయగాం, కెలిబి, పరందోళి, తుమ్మగూడ, కొఠారి, రింగన్‌ఘాట్, దేవాపూర్ తదితర పంచాయతీల పరిధిలో అక్రమ దందా సాగిస్తున్నారు. ఈ ఏడాది రైతుల నుంచి సుమారు 4వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేసినట్లు సమాచారం.

'మహా' మోసం చేసేదిలా..

మహారాష్ట్ర నుంచి దళారులు గ్రామాల్లోకి వచ్చి పత్తి రైతులను కలుస్తారు. క్వింటాల్ పత్తికి మార్కెట్ ధర కంటే రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా చెల్లిస్తామని నమ్మబలుకుతారు. దీంతో రైతులు వారికే విక్రయించేందుకు మొగ్గుచూపుతారు. కొనుగోలు సమయంలో దళారులు వెంటతెచ్చుకున్న కంప్యూటర్ కాంటాను రైతులను పరీక్షించుకోమంటారు. అంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాతే అసలు కథ మొదలవుతుంది. రైతులకు కాంటా చూపినపుడు సరిగానే ఉన్నా ఆ తర్వాత వారి వద్ద ఉన్న రిమోట్‌తో గుట్టుగా 10నుంచి 12కిలోల వరకు అదనపు తూకం జరిగేలా సెట్ చేస్తారు.



ఓ దళారి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న పత్తి వాహనం (ఫైల్)

చిరు జరిమానాతో సరి!

ఐదురోజుల క్రితం మహారాష్ట్రకు చెందిన ఓ దళారి గోయగాం గ్రామంలో పత్తి కొనుగోలు చేశాడు. తూకంలో మోసాన్ని గుర్తించిన రైతులు మార్కెట్ కమిటీ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు వచ్చి ఒక్కో క్వింటాల్‌కు సదరు దళారి 12కిలోల అదనంగా తూకం వేసినట్లు నిర్ధారించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు చేరుకుని 17 క్వింటాళ్ల పత్తి నింపిన వాహనాన్ని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరుసటిరోజు నలుగురు బాధిత రైతులను స్టేషన్‌కు పిలిపించి అదనంగా తూకం వేసిన పత్తికి సదరు దళారి నుంచి డబ్బులు ఇప్పించినట్లు విశ్వసనీయ సమాచారం. మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ ప్రభుత్వ లెక్కల ప్రకారం దళారికి రూ.2,768 జరిమానా విధించినట్లు తెలిసింది. కాగా, పెద్ద మొత్తంలో మోసానికి గురి చేస్తున్న దళారిని చిన్నపాటి జరిమానాతో వదిలిపెట్టడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తీర్మానం వెనక్కి తీసుకోవాలి

కెరమెరి: కొత్తగా 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు చేసిన తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆదివాసీ సేనా జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి డిమాండ్ చేశారు. ఆదివారం జైనూర్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడున్న ఎస్టీలకు సరైన సంక్షేమ పథకాలు అందక అభివృద్ధికి ఆమడదూరంలో ఉండగా, మరో 11 కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఇదే జరిగితే ఆదివాసీల జీవితాలు చీకటి అధ్యాయంగా మిగిలిపోతాయని పేర్కొన్నారు. జస్టిస్ చెల్లప్ప కమిషన్‌కు రెండు కులాలను ఎస్టీ జాబితాలో చేర్పిస్తామని ఇప్పుడు 11 కులాలు చేర్చడం భావ్యం కాదని, తన నిర్ణయాన్ని సీఎం కేసీఆర్ వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు వామనరావు, విశంరావు, ఆడ రాజు, మడావి ఉమేశ్, ఆత్రం కిషన్‌రావు, సోయం ఇందురావు, ఆడ విలాస్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న గణేశ్

క్లుప్తంగా

ప్రాణహిత సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు


వివరాలు సేకరిస్తున్న ఎస్సై వెంకట్

కోటపల్లి: తెలంగాణ మహారాష్ట్ర ప్రాణహిత సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సీఐ విద్యాసాగర్, ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో ప్రాణహిత సరిహద్దు గ్రామాలైన వెంచపల్లి, జనగామ, ఆలుగామ గ్రామాలను సందర్శించి సరిహద్దు భద్రతపై గ్రామస్తులతో చర్చించారు. అనంతరం ప్రాణహిత నదిలో చేపలు పట్టే వారితో మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు సరిహద్దుల్లో సంచరిస్తే ఆశ్రయం కల్పించకూడదని సూచించారు. గ్రామాల్లో కొత్తగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు వచ్చే వారి వేలిముద్రలను సేకరించి వారి వివరాలను నమోదు చేసుకున్నారు. నాటు పడవల్లో సరిహద్దుల్లో తెలంగాణలోకి వస్తున్న ప్రతిఒక్కరిని తనిఖీ చేశారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడి మృతి

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఆరెగూడ గ్రామానికి చెందిన బీమన్కార్ గోపయ్య (77) ఆదివారం ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఎద్దులకు నీటిని పెట్టేందుకుగాను గోపయ్య బావిలో నీటిని తోడుతుండగా, ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. గ్రామస్తుల సహాయంతో తీసేందుకు ప్రయత్నించినప్పటికి అప్పటికే మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుడి కుమారుడు బీమన్కార్ ఆనంద్ రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


సుజాత మృతదేహం

జైపూర్: జైపూర్ మండలం ఇందారం వద్ద శనివారం అర్ధ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎంబడి సుజాత(38) మృతి చెందింది. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. మందమర్రి పట్టణంలో తన ఇంటి ఎదుట నివాసం ఉండే పరిచయస్తుడైన పొన్నాల సంతోశ్ అనే వ్యక్తి బైక్‌పై తన అవసరం నిమిత్తం శనివారం రాత్రి 7గంటల సమయంలో గోదావరిఖనికి వెళ్లిన సుజాత తిరిగి రాత్రి 12గంటల సమయంలో తిరిగి వెళ్తున్న క్రమంలో ఇందారం వద్ద శివసాయి రైస్ మిల్ సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజాత, సంతోశ్ తీవ్రంగా గాయపడగా వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం సుజాత మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

పలు ఇళ్లల్లో దొంగతనం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని పలు ఇళ్లల్లో పట్టపగలే దొంగతనాలకు పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. గాంధీనగర్ కాలనీలో ఇంటి ఎదుట పెట్టిన సైకిల్‌ని ఎత్తుకెళ్లారు. అలాగే ఆంధ్రాకాలనీలో ఇంటి ఎదుట నిలిపిన రెండు బైకుల పెట్రోల్ పైపులను కోసి పెట్రోల్ దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మనసు నిండా... మాండలికపు పరిమళాలు

ఒకప్పుడు దేశంలో, ప్రపంచంలో ఏ సంఘటన జరిగినా కొన్ని రోజులకు గాని తెలిసేది కాదు. కానీ శాస్త్రీయ పరిశోధనలు ఎన్నో ఆవిష్కరణల ఆవిర్భావానికి నాంది పలికాయి. ఎన్నో విభిన్న సమాచార సాధనాలను పరిచయం చేశాయి. అర క్షణంలో సమాచారం మనమున్న చోటికి వచ్చి చేరింది. ఈ సమాచార విప్లవంలో రేడియోది ప్రత్యేక స్థానం. సమాచారం, వినోదం, సంగీతం ఇలా ఒకటేమిటి ఎన్నో అంశాలను ఒడిసిపట్టి శ్రోతలకు వీనుల విందు చేసింది. ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు, నిర్ణయాత్మక ఘటనలకు వేదికగా నిలిచింది. రేడియోకు ధీటుగా ఎన్ని ప్రసార సాధనాలు వచ్చినా తన రూపు, తీరు మార్చుకుంటూ... కాలం కరిగిపోతున్నా... తరాలు మారిపోతున్నా... తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపుతో వినిపిస్తూనే ఉంది. వైవిధ్యంతో తన ఉనికిని చాటుకుంటోంది. 'ఆదిలాబాద్ ఆకాశవాణి కేంద్రం' వైవిధ్య కార్యక్రమాల మేళవింపుతో అన్ని వర్గాలను ఆకట్టుకుంటూ 'రేడియో'ను పునరుత్తేజితం చేస్తోంది. ఏళ్లుగా తన ఆదరణను నిలుపుకుంటూ వస్తున్న రేడియోపై 'ప్రపంచ రేడియో దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం. – ఆదిలాబాద్

- వన్నె తగ్గని రేడియో ప్రసారాలు
- ఎఫ్‌ఎం సౌకర్యంతో అందరికీ అందుబాటులో
- కొంగొత్త ప్రయోగాలతో ముమ్ముందుకు...
- యాస, సంస్కృతికి పట్టం
- త్వరలోనే ఉమ్మడి జిల్లాలో ఆకాశవాణి సేవలు
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవం

1986 నుంచి నిర్విరామంగా...

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆకాశవాణి కేంద్రం 1986 అక్టోబర్ 12 వ తేదీన ప్రారంభమైంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం వెంకటరామిరెడ్డి ఈ భవనానికి శంకుస్థాపన చేయగా, కేంద్ర రేడియో సమాచారశాఖ డిప్యూటీ మంత్రి అరీఫ్ మహ్మద్‌ఖాన్ ప్రారంభించారు. ఈ కేంద్రం దేశంలోనే మూడోది కాగా, ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో తొలి కేంద్రం కావడం విశేషం. 2015 ఆగష్టు 15వ తేదీన నాణ్యతతో కూడిన ఎఫ్‌ఎం ప్రసారాలను ఆరంభించింది. 'హలో ఆదిలాబాద్.. 100.2 ఎఫ్‌ఎం.. మనసు నిండా' అంటూ ప్రస్తుతం మూడు కిలోవాట్ల సామర్థ్యంతో 100.2 ఫ్రీక్వెన్సీ ద్వారా ప్రసారాలను అందిస్తోంది. ఈ ఫ్రీక్వెన్సీతో జిల్లా కేంద్రం నుంచి సుమారు 30–40 కిలో మీటర్ల పరిధిలో శ్రోతలు ఎఫ్‌ఎం ప్రసారాలను వినవచ్చు. త్వరలోనే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 100.2 ఎఫ్‌ఎం సేవలు అందుబాటులోకి రానున్నాయి.

వినూత్న కార్యక్రమాల వీచిక..

ఆదిలాబాద్ ఆకాశవాణిలో వినూత్న కార్యక్రమాలను ప్రసారం చేస్తూ శ్రోతలను అలరిస్తున్నారు. స్థానికత ఉట్టిపడేలా ఈ కార్యక్రమాల పరంపర సాగుతోంది. ఉదయం 6 గంటల నుంచి మొదలుకుని 11 గంటల వరకు 17 గంటల పాటు 100.2 ఎఫ్‌ఎం.. అలా సాగుతూనే ఉంటుంది.

ఆధ్యాత్మికతకు పెద్దపీట...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నో పండుగలు, జాతరలు వైభవంగా నిర్వహిస్తారు. అందులోనూ గిరిజన సంస్కృతి, సంప్రదాయ సంబంధమైన జాతరలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అటువంటి జాతరలైన నాగోబా మహోత్సవాలకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలను ప్రసారం చేస్తారు. జాతర మహోత్సవం శ్రోతల కళ్లముందే కదలాడేలా సజీవంగా గోచరించేలా అద్భుతమైన వ్యాఖ్యానంతో ఈ అంశాలను తీర్చిదిద్దుతారు.

సాగుబడికి సాయంగా....



ఆకాశవాణి కేంద్రం ద్వారా వ్యవసాయదారులకు అవసరమైన అన్ని రకాల కార్యక్రమాలు ప్రసారం చేస్తూ వారికి ఎల్లవేళలా కిసాన్ వాణి, ఇల్లు ఎవుసం కార్యక్రమాలలో భాగంగా విత్తనాలు విత్తుకోవడం నుంచి ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ, పంట కోత, పంట నిల్వ, మార్కెటింగ్ వంటి వివరాలను సైతం వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం నిపుణులు, వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలతో విలువైన, సలహాలు సూచనలు నిత్యం అందజేస్తున్నారు. – రైతు అంతరంగం

స్థానిక కళలకు పునరుజ్జీవం



స్థానిక భాష, యాసకు పెద్ద పీటవేసి ఆకాశవాణి హండ్రెడ్ పాయింట్ టు ఎఫ్‌ఎంలో అంతర్థానమయ్యే దశలో ఉన్న గ్రామీణ, గిరిజన కలలు కళాకారులను ప్రోత్సహిస్తూ వారిచే ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తూ వాటికి జీవం పోస్తుంది. పల్లె పదాలు, గిరిపదం కార్యక్రమాలలో భాగంగా రేల పాటలు, చేల పాటలు, దంచుడు, ఇసిరే, పెళ్లి, ప్రేమ, భజన, గిరిజన దేవతల , గోండి, కొలామి, లంబాడీ పాటలను కళాకారులతో పాడిస్తున్నారు. -మన పురాణాలు

యువజనులకు యువ వాణి..



పాతకాలం వారి కార్యక్రమాలే రేడియోలో ప్రసారం అవుతాయనే సంప్రదాయానికి గండి కొడుతూ యువతను ఆకర్షించే విధంగా యువ వాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో వివిధ కళలు, చదువులు, ఉపాధిలో రాణిస్తున్న వారి ఇంటర్వ్యూలు, అభిప్రాయాలు తీసుకుంటున్నారు. అలాగే 'నాకు నచ్చిన సినిమా పాటలు' అనే కార్యక్రమంలో నూతనంగా రిలీజ్ అయిన సినిమా పాటలను ప్రసారం చేస్తూ యువతను ఆకట్టుకుంటోంది. – యువ వాణి

దిగుబడులను పెంచుకోవచ్చు



రేడియోలో వ్యవసాయానికి సంబంధించిన ప్రోగ్రాములు చాలా ఎక్కువగా వేస్తుంటారు. ముఖ్యంగా సాగు చేసే సమయంలో చీడపీడల నివారణపై ఏ మందులు, ఎరువులు వాడాలో అధికారులు, శాస్త్రవేత్తలు వివరిస్తుంటారు. అదేవిధంగా నూతన సాగు పద్ధతుల గురించి తెలియజేయడం వలన కొత్త పంటలను సైతం పండించడానికి వీలు కలుగుతుంది.

– చిల్కూరి స్వామి రెడ్డి, తాంసి, రైతు

స్థానిక సంస్కృతిపై అవగాహన



100.2 ఎఫ్‌ఎం తరచూ వింటూ ఉంటాను. సినిమా పాటలతో పాటు ఎంతో విభిన్నమైన కార్యక్రమాలను ప్రసారం చేస్తుంటారు. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలతో పాటు కళలు, జాతరల గురించి నేటి తరానికి తెలియజేస్తుండడం అభినందనీయం. నిత్యం సెల్ ఫోన్లలో ఉండే యువతకు 100.2 ఎఫ్‌ఎం ద్వారా స్థానిక సంస్కృతి సంప్రదాయాలపైన అవగాహన పెరుగుతుంది.

– జాదవ్ అర్జున్ కుమార్, భుక్తాపూర్ ఆదిలాబాద్

నాణ్యమైన ప్రసారాలు అందిస్తాం...



ప్రస్తుతం స్థానికతకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నాం. ఇక్కడి వైశిష్ట్యమైన గిరిజన, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని కాపాడేలా ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నాం. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన ఎఫ్‌ఎం ప్రసారాలు వినిపించేలా టవర్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. టవర్ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రసారాలు అందుబాటులోకి వస్తాయి.

– రామేశ్వర్ కేంద్రే,
ఆదిలాబాద్ ఆకాశవాణి ముఖ్య కార్యక్రమ నిర్వహణ అధికారి

26న రాష్ట్రస్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ, ఎస్సై, క్రీడాకారులు

బెల్లంపల్లి(మంచిర్యాల): మంచిర్యాల జిల్లా ఏఎంసీ క్రీడా మైదానంలో ఈ నెల 26న తెలంగాణ బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి గడప రాకేశ్, బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి పన్నాల సదానందం తెలిపారు. బెల్లంపల్లి వన్‌టౌన్ ఆవరణలో సీఐ ముస్కే రాజు, తాండూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ కె.జగదీష్ ఆదివారం అసోసియేషన్ నిర్వాహకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. పోటీల్లో ప్రతిభా కనబరిచే క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో మిస్టర్ ఐరన్ మ్యాన్, మిస్టర్ ఆదిలాబాద్ టైటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిస్టర్ ఐరన్ మ్యాన్‌కు రూ.రూ.50వేలు, మిస్టర్ ఆదిలాబాద్‌కు రూ.15వేలు అందజేయనున్నట్లు తెలిపారు. మొదటి గోల్డ్‌కు రూ.5వేలు, రెండో సిల్వర్‌కు రూ.4వేలు, మూడో బ్రాంజ్‌కు రూ.3వేలు అందించనున్నట్లు ప్రకటించారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై సంతోష్, జిల్లా క్యారమ్ అసోషియేషన్ కార్యదర్శి టి.రాజన్న, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రేవెల్లి విజయ్‌కుమార్, నిర్వాహకులు సిర్ర బాలకృష్ణ, చంద్రశేఖర్, సీనియర్ క్రీడాకారులు గిరి ప్రసాద్, ఉస్మాన్, మొబిన్, కృష్ణస్వామి, లక్ష్మణ్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన అప్పుల బాధ

సారంగపూర్: అప్పుల బాధ ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన సారంగపూర్ మండలంలోని బోరిగాం గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. బంధువుల వివరాల ప్రకారం... రుద్రాక్ష చంద్రశేఖర్ (40) పెద్ద కుమారుడికి మానసిక ఎదుగుదల లేకపోవడంతో అప్పులు చేసి వైద్యం చేయించాడు. అప్పులు భారంగా మారడంతో పాటు కుమారుడికి ఆరోగ్యం నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం బయటకు వెళ్తానని భార్యతో చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం పంట పొలాలకు వెళ్లే రైతులకు స్వర్ణ కాలువ పక్కనే చెట్టుకు ఉరేసుకుని కనిపించడంతో అతడి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య కవితతో పాటు ఎనిమిదేళ్లలోపు ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంతర్రాష్ట్ర రహదారిపై లారీ బోల్తా

తాంసి: మండలం పొన్నారి సమీపంలో అంతర్రాష్ట్ర రహదారిపై లారీ బోల్తా పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న ట్రక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

సహకార సంఘాల్లో సభ్యత్వం తీసుకోవాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌యాదవ్

భీమారం:గొర్రెలు పెంపకందారులు సహకార సంఘాల్లో కొత్తగా సభ్యత్వం తీసుకోవాలని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం రాష్ట అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ సూచించారు. మండలంలోని కాజీపల్లిలో గొర్రెల కాపరులతోపాటు యాదవులకు సహకార సంఘాల ఏర్పాటుపై ఆదివారం అవగాహన కల్పించారు. రెండో విడుత లబ్ధిదారులకు త్వరలోనే గొర్రెల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు డీడీలు చెల్లించని వారు వెంటనే చెల్లించాలని కోరారు. 18 ఏళ్ల నిండిన గొర్రెల కాపరులు సహకార సంఘాల్లో సభ్యత్వం తీసుకోవాలని పేర్కొన్నారు. సభ్యత్వం ఉంటేనే ప్రభుత్వ పథకాలు పొందే అవకాశం ఉంటుందని అన్నారు. గతంలో సభ్యత్వం పొందిన వారే సంఘంలో ఉన్నారని, కొత్త వారికి అవకాశం కల్పించాలని అనేక గ్రామాల్లో డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లినట్లు చెప్పారు. కొత్త వారికి అవకాశం కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. గ్రామాల్లో జీవాలకు పశుగ్రాసం కోసం అటవీప్రాంతాన్ని కేటాయించాలని రాష్ట పశుసంవర్ధక శాఖ మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రతీ యాదవ కుటుంబం సహకార సంఘాల్లో కీలక పాత్రపోషించాలని సూచించారు. సమావేశంలో యాదవ సంఘం నాయకులు బీరేశ్, నరేశ్, సమ్మయ్య మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలో పడి రైతు మృతి

మామడ: ప్రమాదవశాత్తు సరస్వతీ కాలువలో పడి రైతు మృతిచెందిన సంఘటన మండలంలోని చందారం గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ వివరాల ప్రకారం... కొరికల్ గ్రామానికి చెందిన మోతె నడిపి రాజన్న (65) ఆదివారం వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం చేను వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో చేను పక్కనే గల సరస్వతీ కాల్వలో పడిపోయాడు. చందారం గ్రామ శివారులోని కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. రాజన్న మృతదేహంగా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గిరిజనులకు వైద్యసేవలు

- ఉట్నూర్ కేంద్రంగా డయాగ్నోస్టిక్ హబ్
- 57 రకాల రక్త పరీక్షలు
- సబ్ డివిజన్ పీహెచ్‌సీల అనుసంధానం


నిర్మాణదశలో ఉట్నూర్ డయాగ్నోస్టిక్ హబ్ భవనం

ఉట్నూర్: గిరిజనుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ప్రత్యేక చర్యలు చేపట్టింది. అనారోగ్య లక్షణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే భవన నిర్మాణం పూర్తిదశకు చేరుకోగా, త్వరలో డయాగ్నోస్టిక్ సేవలు గిరిజనులకు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్యసేవలే లక్ష్యంగా..

ఏజెన్సీ గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రూ.97 లక్షల నిధులతో ఉట్నూర్ సీహెచ్‌సీ ఆవరణలో డయాగ్నోస్టిక్ కేంద్ర భవనాన్ని నిర్మిస్తోంది. ఈ భవన నిర్మాణం పూర్తి కాగానే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి సేవలు అందుబాటులోకి తీసుకువచ్చిన ప్రభుత్వం గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్ర భవన నిర్మాణం పూర్తికాగానే కేంద్రంలో వైద్యాధికారితోపాటు ఐదుగురు ల్యాబ్ టెక్నీషియన్లు, మైక్రో బయాలజిస్టుతోపాటు ఇతర సిబ్బందిని ఐటీడీఏ నియమించనుంది.

57 రకాల రక్తపరీక్షలు..
8 పీహెచ్‌సీల అనుసంధానం

టీ హబ్ ఏర్పాటు కాగానే ఏజెన్సీ ఉప డివిజన్‌లోని శ్యాంపూర్, హస్నాపూర్, దంతన్‌పల్లి, ఇంద్రవెల్లి, పిట్టబొంగరం, నార్నూర్, గాదిగూడ, ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డయాగ్నోస్టిక్ కేంద్రానికి అనుసందానం చేయనున్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోకి వచ్చే గిరిజనులకు 57 రకాల రక్తపరీక్షలు నిర్వహించి 24 గంటల్లో ఫలితాలు వెల్లడించనున్నారు. అనుసంధానమయ్యే పీహెచ్‌సీల నుంచి గిరిజనుల రక్తనమునాలు సేకరించి డయాగ్నోస్టిక్ కేంద్రానికి పంపించి 57 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి అనారోగ్య లక్షణాలు నిర్ధారించి తగిన వైద్య సేవలు అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసి ప్రతిరోజు సేకరించిన రక్త నమునాలను తరలించనున్నారు. అనంతరం ఆన్‌లైన్ ద్వారా ఫలితాలను ఆయా పీహెచ్‌సీలకు పంపించనున్నారు. ఈ డయాగ్నోస్టిక్ కేంద్రం ద్వారా సత్ఫాలితాలు వస్తే మిగతా ఏజెన్సీ పీహెచ్‌సీలను అనుసంధానం చేస్తామని వైద్యాధికారులు అంటున్నారు.

త్వరలో అందుబాటులోకి..

తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ ఏర్పాటు ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. భవన నిర్మాణం పూర్తిదశకు చేరుకుంది. త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. కేంద్రంలో గిరిజనులకు 57 రకాల రక్త పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి లక్షణాలను పూర్తిస్థాయిలో గుర్తించి వైద్యసేవలందించే అవకాశం ఉంది.

– బాలు, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి, ఉట్నూర్

అవసరం మేరకే రుణం పొందాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్


వాకథాన్‌లో పాల్గొన్న కలెక్టర్ బాదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలు నియంత్రిత సంస్థల నుంచి అవసరమైన మేరకే రుణాలు పొందాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఈనెల 12 నుంచి 17 వరకు నిర్వహించనున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపలి చౌరస్తా వరకు 2కే వాకథాన్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌తో కలిసి వాకథాన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతను అందరూ తెలుసుకోవాలని సూచించారు. పొదుపుపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏవైనా కొనుగోలు చేసే ముందు ప్రణాళిక తయారు చేసుకుని అవసరం మేరకు తెలివిగా ఖర్చు చేయాలన్నారు. పొదుపు ఆర్థిక ఇబ్బందులు నుంచి కాపాడుతుందని పేర్కొన్నారు. సంపాదనలో కొంత భాగాన్ని భవిష్యత్ అవసరాకులకు కేటాయించాలని తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్‌లో రుణాలు అందించే మొబైల్ యాప్‌లతో జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు సంబంధిత సమచారం కోసం వినియోగించే నంబర్‌ను బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్ నుంచి పొందాలని, ఓటీపీ, సీవీవీ పాస్‌వర్డ్, పిన్, బ్యాంక్ ఖాతా, ఇతర వ్యక్తిగత వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని వివరించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలోని నియంత్రిత రుణ సంస్థల నుంచి మాత్రమే రుణాలు తీసుకోవాలన్నారు. రుణం పొందే ముందు నిబంధనలు జాగ్రత్తగా చదవాలని తెలిపారు. అనంతర పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతూ కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో వార్డుల్లో ఎక్కడా చెత్త లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ మహిపాల్‌రెడ్డి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ సాజిబ్‌కుమార్ సాహు, బ్యాంక్ ఉద్యోగులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



30 ఏళ్లకు మళ్లీ కలుసుకున్నారు..

పూర్వ విద్యార్థులు

జన్నారం: వారంతా ఒకేచోట చదువుకున్నారు. పై చదువులు, ఉద్యోగాల రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. మళ్లీ 30 ఏళ్ల తరువాత ఆదివారం అదే చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు 1992–93 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు. జన్నారం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కలుసుకుని అనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. చదువు నేర్పించిన గురువులకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. 140 మందికి 126 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనానికి హాజరైనట్లు నిర్వాహకులు, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్ తెలిపారు. కార్యక్రమంలో గురువులు పాపేశ్వర శర్మ, హన్మంతరావు, కిషన్, గంగన్న, రవిందర్, లక్ష్మణ్, రజిని, పూర్వ విద్యార్థులు గోపికృష్ణ, శశిధర్, సంతోష్, సుభాష్‌గౌడ్ , ప్రభాకర్, దేవన్న, నహీరఅలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.